
## ప్రజల చూపు బీఆర్ఎస్ వైపు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- మహబూబ్‌నగర్‌లో సభ పోస్టర్ల ఆవిష్కరణ
- హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్య

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రస్తుతం ప్రజల చూపు బీఆర్ఎస్ వైపు ఉన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వరంగల్ సభ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి, గోడపై అంటించడంతోపాటు సభకు తరలిరావాలని వాల్ పెయింటింగ్ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను పండుగలా నిర్వహించనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక చరిత్రలో నిచిపోయేలా కేసీఆర్ హయాంలో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు.

**బీఆర్ఎస్‌లోకి చేరికలు**

మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు అంబదాస్‌తోపాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ పార్టీ ప్రస్తుతం ప్రజల పక్షాన పోరాటం చేస్తుండడంతో ఆకర్షితులై చేరినట్టు అంబదాస్ ప్రకటించారు.



మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండలో జరిగే పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య, నాయకులు

## నాడు పురోగమనం.. నేడు తిరోగమనం

- రాష్ట్రాన్ని నడిపించలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 9: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ వెనుకబడిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని నడిపించలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పురోగమనంలో ఉంటే, రేవంత్ హయాంలో రాష్ట్రం తిరోగమన బాట పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ముఖ్యనేతలతో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 27న నిర్వహించనున్న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సభకు కామారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ తలసరి ఆదాయ వృద్ధి రేటు దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని, కాంగ్రెస్ పాలనలో ఇప్పుడది 11వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో మూడో స్థానంలో ఉంటే, ఇప్పుడది 14వ స్థానానికి దిగజారిందన్నారు. వరినాట్లు వేసే సమయంలోనే కేసీఆర్ రైతుబంధు వేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఉన్నప్పుడే రైతుబంధు వేస్తున్నదని విమర్శించారు. తెలంగాణను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు గూబ గుయ్యిమనేలా వరంగల్ సభతో సమాధానమిస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజకీయం ఒక టాస్క్ అని, మిగతా పార్టీలకు వ్యాపారమని అన్నారు.

## కేసీఆర్ మాటలు వింటే కాంగ్రెస్‌కు హడలే

- ఒకే గొడుగు కింద కాంగ్రెస్, బీజేపీ
- రాష్ట్రంలో ఉపఎన్నికలు ఖాయం
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



గద్వాల, ఏప్రిల్ 9 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ సభలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ మాటలు వింటే అధికార పార్టీ నాయకుల గుండెలు హడలెత్తిపోవాల్సిందేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో నియోజకవర్గ నేత బాసు హనుమంతు అధ్యక్షతన రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపటి తరానికి జరిగే మేలు గురించి ఈ సభలో కేసీఆర్ ప్రజలకు వివరిస్తారని తెలిపారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్–బీజేపీ ఒకే గొడుగు కింద పని చేసే పార్టీలని ఎద్దేవా చేశారు. వారి టార్గెట్ కేసీఆర్ మాత్రమే అని చెప్పారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ప్రస్తుత పరిస్థితుల్లో బై ఎలక్షన్లలో కాంగ్రెస్‌కు ఓటేసే పరిస్థితిలో ప్రజలు లేరని స్పష్టంచేశారు. స్థానికసంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా గద్వాల కోటపై గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ గుర్తుమీద గెలిచి ద్రోహం చేసిన వ్యక్తులకు బుద్ధి చెప్పాలని తెలిపారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, వారిని కాపాడుకునే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.

## వాహనాలకు రజతోత్సవ ఫ్లెక్సీలు

**స్వయంగా అంటించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

నకిరేకల్, ఏప్రిల్ 9 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఆయనే స్వయంగా ఆర్టీసీ బస్సులు, ఆటోలకు అంటించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ అనేక పోరాటాలతో రాష్ట్రం సాధించి, అన్ని రంగాల్లో ముందు నిలిపిన కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రజతోత్సవ సభకు నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు.



నకిరేకల్‌లో ఆర్టీసీ బస్సుకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను అంటిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# మూణ్నాళ్ల పార్టీ కాదు... రజతోత్సవ పార్టీ

- 27న అంబురాన్నంటనున్న బీఆర్ఎస్ సంబురం
- కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో రికార్డులు
- 25 ఏండ్లల్లో అనేక పోరాటాలు, త్యాగాలు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 9: కేసీఆర్ ఆధ్వర్యంలో 2011 ఏప్రిల్ 27న గులాబీ జెండా పట్టుకొని టీఆర్ఎస్ పార్టీని స్థాపించినప్పుడు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమ పార్టీది మూణ్నాళ్ల ముచ్చట అని వ్యంగ్యంగా మాట్లాడారని, కానీ నేడు అదే పార్టీ రజతోత్సవ సంబురాలకు సిద్ధమైందని ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గులాబీ జెండా పట్టుకొని తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల్లో పర్యటించి సభలు, సమావేశాలు పెట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారని తెలిపారు. అనేక నిర్బంధాల మధ్య పుట్టుకొచ్చిన టీఆర్ఎస్ పార్టీ ఉధృత ఉద్యమాన్ని నిర్మించి 2014లో స్వరాష్ట్రాన్ని సాధించిందని గుర్తుచేశారు. 32 రాజకీయ పార్టీలను ఒప్పించి, కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ ఇవ్వక తప్పదనే నిర్ణయానికి తీసుకొచ్చి పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా చేసిన ఘనత గులాబీ జెండాదని చెప్పారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ పాలక పగ్గాలు చేపట్టి దేశం మొత్తం మనవైపు చూసేలా నూతన ఒరవడితో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ తరుణంలో గొప్ప బహిరంగ సభ ద్వారా ప్రజలను జాగృతం చేసేందుకు మంచి సందేశాన్ని కేసీఆర్ ఇవ్వనున్నారని వెల్లడించారు. ఇందుకు వేదికగా ఎల్కతుర్తిని ఎంచుకున్నామని, ఇందుకు స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. 27న జరిగే బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నేషనల్ హైవేలపై వెంటనే చేపట్టాల్సిన పనుల గురించి చర్చించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్‌ను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లారు.

## కేసీఆర్ పేరును చెరిపేసేందుకు రేవంత్ కుట్ర

- బీఆర్ఎస్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి
- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- ఖమ్మంలో ముఖ్యనేతల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మం, ఏప్రిల్ 9: తెలంగాణ నుంచి కేసీఆర్ పేరును చెరిపేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. అది ఎప్పటికీ సాధ్యం కాదని, బీఆర్ఎస్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లాలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం జిల్లా, నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన బుధవారం ఖమ్మంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో అజయ్ మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవాన్ని జయప్రదం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. సభ అనంతరం ఆన్‌లైన్ మెంబర్‌షిప్ కోసం కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. 2001లో పార్టీని స్థాపించిన ఉద్యమసారథి కేసీఆర్.. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు ఛేదించి చావునోట్లో తలపెట్టి 2014లో స్వరాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. అలాంటి ధీశాలి సారథ్యంలో నడుస్తున్న పార్టీలో మనమందరమూ సభ్యులుగా ఉండడం గర్వకారణమని చెప్పారు. ఆరు గ్యారెంటీలంటూ ఊదరగొట్టి 16 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ గ్యారెంటీలన్నింటినీ అటకెక్కించిందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని స్పష్టంచేశారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను విడుదల చేశారు.

## పండుగలా రజతోత్సవ సభ

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వీరయ్య
- తల్లాడలో శ్రేణులకు దిశానిర్దేశం



పెనుబల్లి/వైరా టౌన్, ఏప్రిల్ 9 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించబోతున్నామని, ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా తల్లాడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి గృహంలో ఆయన అధ్యక్షతన బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.



మహబూబాబాద్ జిల్లా కురవిలో మాలోత్ కవితకు విరాళం అందజేస్తున్న గిరిజన వృద్ధురాలు బాజీ

## పెన్షన్ డబ్బు నుంచి బీఆర్ఎస్‌కు విరాళం

**సభ కోసం అందజేసిన వృద్ధురాలు**

కురవి, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణకు ఓ గిరిజన వృద్ధురాలు విరాళం అందజేసింది. తన వృద్ధాప్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఆసరాగా నిలిచారని, సభ ఖర్చులకు తన పెన్షన్ డబ్బు రూ. వెయ్యిని అందజేసి పెద్ద మనసు చాటుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా కురవిలో చోటుచేసుకున్నది. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత బుధవారం మండల కేంద్రంలో రజతోత్సవ సన్నాహక సభ నిర్వహించారు. తుల్స్యా తండాపరిధిలోని కీమ్యాతండాకు చెందిన బోడ బాజీ రెండు ఐదువందల నోట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలి చేతిలో పెట్టింది. 'భేటీ..మారి పింఛను దీ హాజరు ఆయే దేయాంతి...హజార్ రూపియా మార్ మోటే భేటా కేసీఆర్‌దే'(బిడ్డా.. నాకు రూ. రెండు వేల పింఛన్ వచ్చింది. రూ.వెయ్యి నా పెద్ద కొడుకు కేసీఆర్‌కు ఇస్తున్న) అని చెప్పింది.




## ఇంటింటికీ బీఆర్ఎస్ ఆహ్వాన పత్రిక

**ముక్రా (కే) గ్రామస్థుల పిలుపు**

ఇచ్చోడ, ఏప్రిల్ 9 : సాధారణంగా తమ ఇంట్లో పెళ్లి ఉంటే బంధువులు, గ్రామస్థులకు పెండ్లికార్డులు పంచుతూ ఆహ్వానిస్తారు. కానీ.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామస్థులు మాత్రం తమ ఇంటి పార్టీ బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ప్రత్యేకంగా ఆహ్వానపత్రికను పెండ్లి పత్రికలా తయారు చేసి ఊరంతా పంచారు. బుధవారం మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టుపెట్టి బీఆర్ఎస్ రజతోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27న హనుమకొండలో నిర్వహించే 25 ఏండ్ల గులాబీ పండుగకు ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, మళ్లీ తెలంగాణలో కేసీఆర్ పాలనే రావాలని ప్రజలు కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ పాల్గొన్నారు.



## లోకం పోకడ




## ఢిల్లీ పార్టీలను నమ్మితే బతుకు సున్నా

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పార్టీలను నమ్మితే తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జీఎస్డీపీ, తలసరి వృద్ధిరేటులో తెలంగాణ అట్టడుగున నిలవడమే ఇందుకు నిదర్శనమని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారా? కోట్లాది మంది జీవితాలతో చెలగాటం ఆడుతారా? అని కాంగ్రెస్ హైకమాండ్‌పై ధ్వజమెత్తారు. ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని.. పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిదని పేర్కొన్నారు. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిదేనని, విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనం ఇలాగే ఉంటుందని తెలిపారు. నాటి పదేండ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తున్నదని వివరించారు. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదని, మళ్లీ ఎప్పటికీ మోసపోదని చెప్పారు.

## రజతోత్సవ సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలి

**మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి**



నారాయణపేట, ఏప్రిల్ 9 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి ప్రజలు భారీ గా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.



## 'చలో ఎల్కతుర్తి' వాల్ రైటింగ్ ప్రారంభించిన బీరం

కొల్లాపూర్ రూరల్/పెంట్లవెల్లి, ఏప్రిల్ 9 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. పెంట్లవెల్లిలో గులాబీ శ్రేణులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బీరం మాట్లాడుతూ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ అమలుకాని హామీలు గుప్పించి జనాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇంటి పార్టీ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని చెప్పారు.